క్లుప్తంగా

ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న గ్రామస్తులు

టేకులపల్లి: ఏజెన్సీ మారుమూల గ్రామాల్లోనూ సీసీ రోడ్ల నిర్మాణానికి ఇల్లెందు ఎమ్మెల్యే బానోతు హరిప్రియ నిధులు కేటాయిస్తుండడం ఆనందంగా ఉందని మండలంలోని ప్రెగ్లపాడు పంచాయతీ పరిధి తూర్పుగూడెం తండా ప్రజలు తెలిపారు. ఎమ్మెల్యే కేటాయించిన రూ.20లక్షలతో గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తయిన నేపథ్యాన బుధవారం గ్రామస్తులు ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి మాట్లాడారు. గ్రామస్తులు జాటోతు నరేష్, అంగోతు లచ్చానాయక్, బానోతు రాందాస్‌నాయక్, రవీందర్, లింగా, రాంచందర్, మంగీలాల్, దస్రూ, బిక్కులాల్, బాలు, నాగేష్, లక్ష్మి, కాంతి, సునీత పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో పద సంచలన్



ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు

చుంచుపల్లి: ఆర్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపకులు కేశవరావు బలిరామ్ హెగ్డే వార్ జన్మదినంతో పాటు ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో బుధవారం కొత్తగూడెం పట్టణంలో పద సంచలన్ నిర్వహించారు. కొత్తగూడెం రైల్వే స్టేషన్ రామాలయం నుంచి ఓల్డ్ బస్ డిపో, సూపర్ బజార్, బస్టాండ్ సెంటర్, పోస్టాఫీస్ మీదుగా కొత్తగూడెం క్లబ్ వరకు స్వయం సేవకుల ర్యాలీ ప్రదర్శన కొనసాగింది. అనంతరం కొత్తగూడెం క్లబ్‌లో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగాది పర్వదినం విశిష్టత పంచాంగ శ్రవణం తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ ప్రముఖులు, స్వయం సేవకులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సింగరేణిలో క్రీడలకు ప్రాధాన్యం



బహుమతులు అందజేస్తున్న జీఎం

ఇల్లెందు: సింగరేణిలో క్రీడలకు అధిక ప్రాధాన్యం ఉంటుందని, క్రీడాకారులు తమ ప్రతిభాపాటవాలతో ముందుకెళ్లాలని ఏరియా జీఎం షాలేమురాజు అన్నారు. బుధవారం సింగరేణి సీఈఆర్ క్లబ్‌లో వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 24 రన్స్ అండ్ గోల్స్ స్టేడియంలో క్రీడాకారులకు అన్ని క్రీడలు నిర్వహించటం జరిగిందన్నారు. క్రీడలతో మానసికోల్లాసం, శారీరక దారుఢ్యం పెరుగుతుందని చెప్పారు. ప్రతి ఉద్యోగి ప్రతిరోజూ 30 నిమిషాలు వ్యాయామం చేయాలని సూచించారు. సంక్షేమంలో భాగంగా 24 ఏరియాలో ఓపెన్‌జిమ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సంస్థ ఉత్పత్తిలోనే కాకుండా అటు కార్మికుల సంక్షేమంలో కూడా కీలకపాత్ర పోషిస్తుందన్నారు. గెలుపొందిన క్రీడాకారులను ఘనంగా అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌ఓటూ జీఎం మల్లారపు మల్లయ్య, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ పంజాల శ్రీనివాస్, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ శ్రీహరి, కృష్ణ, సాయి స్వరూప్, గుర్తింపు సంఘం ఉపాధ్యక్షుడు ఎస్.రంగనాథ్ పాల్గొన్నారు.

ఘనంగా జాతర



తరలివచ్చిన భక్తులు

టేకులపల్లి: బేతంపూడిలో కొలువుదీరిన పురాతన ఆలయం శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో బుధవారం రాత్రి ఘనంగా జాతర జరుపుకున్నారు. ప్రతి సంవత్సరం ఉగాదిని పురస్కరించుకుని ఇక్కడ జాతర జరుపుకోవడం ఆనవాయితీ. జిల్లా పరిషత్ చైర్మన్ కోరం కనకయ్య, లక్ష్మి దంపతులు వేడుకలకు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. టేకులపల్లి, బేతంపూడి, కోటల్ల, నర్సాయిగూడెంతో పాటు పలు గ్రామాల నుంచి భక్తులు ప్రభలు కట్టుకుని (ఎడ్ల బండి) ఆలయానికి ఊరేగింపుగా వచ్చారు. ఇల్లెందు, టేకులపల్లి మండలాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి మొక్కులు తీర్చుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్ రావు, సర్పంచ్ యదళ్లపల్లి బాబు, ఎంపీటీసీ బాణోతు పూర్ణ, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఉగాది సంబురాలు

కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లోని అన్ని గ్రామాల్లో ప్రజలు బుధవారం ఉగాది పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. శ్రీ శోభకృత్ నామ సంవత్సరం పురస్కరించుకొని మహిళలు, యువతులు వేకువ జామున లేచి ఇంటి ముంగిళ్లను శుభ్రం చేశారు. ఇంటిల్లిపాది తల స్నానాలు చేసి నూతన వస్త్రాలను ధరించి తమ ఇంటి గుమ్మాలకు మామిడి తోరణాలను అలకరించారు. పూజా కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం ఉగాది పచ్చడి తయారు చేశారు. షడ్రుచులతో తయారు చేసిన ఉగాది పచ్చడిని కుటుంబ సభ్యులకు, ఇరుగు, పొరుగు వారికి పంపిణీ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. వ్యాపారులు, వివిధ వృత్తులకు చెందిన వారు తమ షాపులను, దుకాణాలను మామిడి తోరణాలతో అలకరించి, ప్రత్యేక పూజలు చేశారు. రైతులు గోవులను శుద్ధి చేసి, పసుపు, కుంకుమలతో అలంకరించారు. సాయంత్రం పలు ఆలయాల్లో అర్చకులు పంచాంగ శ్రవణం వినిపించారు. ఈ కార్యక్రమానికి రైతులు, వ్యాపారులు, స్థానికులు హాజరయ్యారు. సింగరేణి పరిధిలో ఘనంగా ఉగాది సంబురాలు నిర్వహించారు. సాయంత్రం ఆలయాల్లో పంచాంగ శ్రవణం వినిపించారు. – సాక్షి నెట్‌వర్క్



పాల్వంచ: ఉగాది వేడుకలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు



కొత్తగూడెంటౌన్: గణేష్ టెంపుల్‌లో...



కొత్తగూడెంటౌన్: లక్ష్మీదేవిపల్లి మండలంలోని శ్రీ సర్వజ్ఞ చండీ పీఠంలో..



ఇల్లెందురూరల్: కొమరారం రామాలయంలో..



కొత్తగూడెంఅర్బన్: శ్రీ చైతన్య స్కూల్‌లో..



పాల్వంచ: వేణుగోపాల్ థియేటర్ ప్రాంగణంలో ఉగాది వేడుకలకు హాజరైన ప్రజలు



జూలూరుపాడు: పాపకొల్లు శివాలయంలో పంచాంగ శ్రవణం



సింగరేణి(కొత్తగూడెం): వీకే-7 షాఫ్ట్‌లో..

నాసిరకంగా రోడ్డు విస్తరణ పనులు



నాణ్యతా లోపంతో నిర్మించిన డివైడర్

పాల్వంచ: పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్ నుంచి అల్లూరి సెంటర్ వరకు జరుగుతున్న ఆర్‌అండ్‌బీ రోడ్డు విస్తరణ పనుల్లో నాణ్యత లేకుండా చేపడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సుమారు రూ.5 కోట్ల నిధులతో రోడ్డు మధ్యలో డివైడర్, సెంట్రల్ లైటింగ్, ఎలక్ట్రికల్ టవర్స్, పాత స్తంభాల తొలగింపు తదితర పనులను ఇటీవల చేపట్టారు. ఈ పనుల్లో డివైడర్ పనులకు గాను రూ.2కోట్ల వరకు వెచ్చించారు. అయితే డివైడర్ పనులు అధ్వానంగా మారాయని పలువురు పట్టణ ప్రజలు సామాజిక మాధ్యమాల్లో ఫొటోలు పోస్ట్ చేస్తు విమర్శలు గుప్పిస్తుండటం పరిపాటిగా మారింది. పనుల్లో దిమ్మెలు పగిలిపోయిన దృశ్యాలు పోస్టింగ్‌లు పెట్టగానే వెంటనే వాటిని సంబంధిత కాంట్రాక్టర్ సరిచేస్తున్నారు. అధికారుల తీరుపై ఆరోపణలు చేస్తున్న విషయాలు తరచూ వైరల్‌గా మారుతున్నాయి. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ ఏఈ వంశీని వివరణ కోరగా.. అరకొర నిధుల వల్లే ఈ పరిస్థితి ఉందని, నిర్మాణంలో ఉండగానే ప్రమాదాలు జరుగుతుండటంతో డివైడర్లు కదిలినట్లు చెప్పారు. నాణ్యత లేదని చెప్పడం సరికాదు. ట్రాఫిక్ సమస్యలను మున్సిపాలిటీ తొలగించగలిగితే ఇలాంటి పరిస్థితులు ఉండవని తెలిపారు.

25 నుంచి ఐఎఫ్‌టీయూ మహాసభలు

జూలూరుపాడు: ఈనెల 25, 26, 27వ తేదీల్లో మంచిర్యాలలో జరగనున్న భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) తెలంగాణ రాష్ట్ర 9వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వై.గోపాల్‌రావు పిలుపునిచ్చారు. బుధవారం గుండెపుడిలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను రాష్ట్ర మహాసభల్లో చర్చించడంతోపాటు, భవిష్యత్ పోరాటాల కార్యాచరణ రూపొందించడం జరుగుతుందన్నారు. 25న మంచిర్యాల జిల్లా కేంద్రంలో కార్మికుల ప్రదర్శన, బహిరంగసభ నిర్వహించనున్నట్లు చెప్పారు. 26, 27వ తేదీల్లో రాష్ట్ర ప్రతినిధులతో మహాసభ జరగనున్నట్లు తెలిపారు. ఈ మహాసభలకు ప్రొఫెసర్ హరిగోపాల్, టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కె.నారాయణ, సీనియర్ జర్నలిస్టు ఎండీ మునీర్, ఏఐకేఎంఎస్ జాతీయ అధ్యక్షుడు వేములపల్లి వెంకట్రామయ్య, ఐఎఫ్‌టీయూ జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు అపర్ణ, బి.ప్రదీప్, పోటు ప్రసాద్, సామాజిక కార్యకర్త గురజాల రవీందర్‌రావు హాజరు కానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కుంచం జమలయ్య, వెంకటేశ్వర్లు, పుల్లమ్మ, బత్తుల రమణ, ప్రశాంత్, సాయి తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలి

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసిన వారిని బేషరతుగా తక్షణమే విడుదల చేయాలని టీపీసీసీ జనరల్ సెక్రెటరీ ఎడవల్లి కృష్ణ ఒక బుధవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. నిజాన్ని నిర్భయంగా చెప్పడం, ప్రభుత్వ అధికారులు అక్రమాలకు పాల్పడితే వాటిని ఖండించినందుకా? పేదల జీవితాలతో అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నదుకా? అధికారులు అవినీతికి పాల్పడితే వాటిని ప్రజలకు తెలిపినందుకు అరెస్టులు చేస్తున్నారా అని ప్రశ్నించారు. ప్రజా నిరంకుశ పాలన ఎండగట్టే వారిని ప్రభుత్వం అణిచివేయాలని చూడడం సరికాదని తెలిపారు. తక్షణం అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

బైక్ అదుపు తప్పి యువకుడికి తీవ్ర గాయాలు



గాయపడిన సురేష్

ఇల్లెందురూరల్: మండలంలోని ఒడ్డుగూడెం గ్రామ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చింత సురేష్ తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు... ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం రొట్టమాకరేవు గ్రామానికి చెందిన చింత సురేష్ ఇల్లెందు నుంచి ఒడ్డుగూడెం మీదుగా స్వగ్రామానికి బైక్‌పై బయలు దేరాడు. మార్గమధ్యలో ఒడ్డుగూడెం గ్రామ సమీపంలో అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న గుంతలో పడిపోయాడు. గమనించిన స్థానికులు సురేష్‌ను ఇల్లెందు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మండలంలో జెడ్పీ చైర్మన్ పర్యటన

టేకులపల్లి: జిల్లా పరిషత్ చైర్మన్ కోరం కనకయ్య బుధవారం టేకులపల్లి మండలం బేతంపూడి పంచాయతీలో పర్యటించారు. బేతంపూడి నుంచి కోటల్ల గ్రామానికి గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఆలయ ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ చేశారు. కోయగూడెం గ్రామానికి చెందిన పూనెం రామకృష్ణ ఇటీవల రోడ్డు ప్రమాదం గాయపడగా.. ఇంటికి వెళ్లి పరామర్శించారు. అనంతరం తడికలపూడి పంచాయతీ లక్ష్మీపురంలో ఊకె శేఖర్‌రావు ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో కోరం లక్ష్మి, సర్పంచ్‌లు యదళ్లపల్లి బాబు, ఊకె నర్సమ్మ, సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్‌రావు, ఎంపీటీసీ బానోతు పూర్ణ, మాజీ సర్పంచ్ రెడ్యానాయక్, మాజీ ఎంపీటీసీ బానోతు శంకర్ తదితరులు పాల్గొన్నారు.



బేతంపూడిలో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య

అమరులను స్ఫూర్తిగా తీసుకోవాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: స్వాతంత్య్రం కోసం పోరాడి అసువులు బాసిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ 92వ వర్ధంతి వారోత్సవాలను జయప్రదం చేయాలని పీవైఎల్ జిల్లా నాయకుడు బొగ్గారపు రాజు పిలుపునిచ్చారు. ఈనెల 23వ తేదీ నుంచి 30 వరకు నిర్వహిస్తున్న వారోత్సవాల ప్రచార పోస్టర్లను బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆంగ్లేయులు దేశ ప్రజల సంపదను దోచుకోవడం, హక్కులు, స్వేచ్ఛను హరించి వేయడాన్ని దోపిడీ, ఆధిపత్యం, పెత్తనాన్ని సవాల్ చేస్తూ హక్కులు, సమానత్వం కోసం పోరాడిన ధీరులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ అని కొనియాడారు. వారి అందించిన స్ఫూర్తితో నేటి యువత నడుచుకోవాలి, వారి ఆశయాలను సాధించేందుకు కృషి చేయాలని కోరారు. అమరులు ఎప్పటికీ ప్రజలకు గుర్తుండేందుకు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాలను ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భూక్యా శ్యామ్, ఇర్ప రాజేష్, సునీల్, యశ్వంత్, హేమంత్, కార్తీక్, గణేష్, రోహిత్, గౌతమ్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సమాచారాన్ని ఆన్‌లైన్ చేయండి



మాట్లాడుతున్న హరిశంకర్

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియాలోని ఉద్యోగుల ఆరోగ్య సమాచారాన్ని ఆన్‌లైన్ చేయాలని సింగరేణి ఐటీ విభాగం డీజీఎం హరిశంకర్ సూచించారు. బుధవారం ఇల్లెందులో జరిగిన సమావేశంలో శాప్ ద్వారా ఆన్‌లైన్ చేసే విధానంపై ఆఫీసర్స్ క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆయన గనులు, డిపార్ట్‌మెంట్ల క్లర్క్‌లకు అవగాహన కల్పించారు. ఉద్యోగులు వారి కుటుంబ సభ్యుల వివరాలను ఇక మీదట ఆన్‌లైన్ చేయనున్నట్లు తెలిపారు. తద్వారా ఉద్యోగుల ఆరోగ్య వివరాలు సులభంగా తెలుసుకుని తగు వైద్యం అందించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఏరియా సేఫ్టీ ఆఫీసర్ పంజాల శ్రీనివాస్, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, డీజీఎం వర్క్‌షాప్ శేఖర్‌బాబు, డీవైసీఎంఓ మల్లారెడ్డి, మైన్స్ సేఫ్టీ ఆఫీసర్ శివప్రసాద్, రాజు, డిప్యూటీ మేనేజర్ నాగదీప, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ శ్రీహరి, సాయి స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా గ్రామీణ రహదారులు

- రహదారిపై అడుగుకో గుంత
- పట్టించుకోని పంచాయతీరాజ్ అధికారులు
- ఇబ్బందిపడుతున్న ప్రజలు

పాల్వంచరూరల్: మారుమూల గిరిజన ప్రాంత గ్రామాల రహదారులు అధ్వానంగా మారాయి. రోడ్లపై పలుచోట్ల కంకరతేలి, గుంతలు ఏర్పడి వాహనాల రాకపోకలకు ప్రమాదకరంగా మారాయి. మండలంలోని మారుమూల గిరిజన ప్రాంతాలైన లక్ష్మీదేవిపల్లి నుంచి మల్లారం, నర్సింహసాగర్ గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులు అనేక సంవత్సరాల క్రితం నిర్మాణం చేయడంతో నేడు అధ్వానంగా మారాయి. వర్షం పడితే గుంతల్లో నీరునిలిచి ఏ గుంత ఎంత ఉందో తెలియని పరిస్థితి. ఆయినా సంబంధిత అధికారులు మాత్రం స్పందించడం లేదు.

రహదారి నిర్వహణను పట్టించుకోవడం లేదు. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే రోడ్లు దెబ్బతినడంతో వాహనదారులు, ప్రధానంగా ద్విచక్రవాహనదారులు పలుమార్లు ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయి.

రెండేళ్ల క్రితమే నిధులు మంజూరు..

లక్ష్మీదేవిపల్లి క్రాస్ రోడ్డు నుంచి మల్లారం గ్రామం వరకు మూడు కిలోమీటర్లు, నర్సింహసాగర్ గ్రామం వరకు ఒక కిలోమీటర్ల రోడ్డు అధ్వానంగా ఉండటంతో ఏడాది క్రితం పంచాయతీరాజ్ శాఖ నుంచి రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేశారు. కానీ పలుమార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు.



గుంతలతో మల్లారం రహదారి


వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు..

మల్లారం, నర్సింహసాగర్ గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారుల మధ్య వాగులు ఉండటం వలన వర్షాకాలంలో వరదలకు లోలెవల్ చప్టాల వద్ద వరద నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. దీంతో రెండు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం వస్తే గ్రామం నుంచి మండల కేంద్రమైన పాల్వంచకు వెళ్లాలంటే నరకం. వర్షం వచ్చిన రోజున చప్టాల వద్ద వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో రాకపోకలు నిలిచిపోతాయి.



అధ్వానంగా నర్సింహసాగర్ రోడ్డు


రోడ్డు నిర్మించాలి



మల్లారం నుంచి లక్ష్మీదేవిపల్లి క్రాస్‌రోడ్డు వరకు మూడు కిలోమీటర్ల రహదారిపై కంకర తేలి, గుంతలు ఏర్పడి ప్రమాదకరం మారింది. రోడ్డు నిర్మాణం చేయాలని అధికారులకు, రాజకీయ నేతలకు అనేకసార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే రోడ్డు నిర్మాణం చేపట్టాలి.

– రవి, మల్లారం


ప్రయాణం భయంగా ఉంది..



లక్ష్మీదేవిపల్లి క్రాస్ రోడ్డు నుంచి నర్సింహసాగర్ గ్రామం వరకు రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడడంతో రాకపోకలకు భయమేస్తోంది. వర్షాకాలంలో అయితే మరింత ప్రమాదకరం. ఏ మాత్రం వర్షం వచ్చినా వాగు వస్తుంది. రాకపోకలు నిలిచిపోతాయి. వెంటనే అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి.

– కాలం కాంతమ్మ, నర్సింహసాగర్

నిధులు మంజూరయ్యాయి



లక్ష్మీదేవిపల్లి క్రాస్ రోడ్డు నుంచి మల్లారం గ్రామం వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి ఎంఆర్‌ఆర్ స్కీమ్ కిందరూ.62లక్షలు, నర్సింహసాగర్ నుంచి లక్ష్మీదేవిపల్లి క్రాస్‌రోడ్డు వరకు రూ.22లక్షలు గతేడాది మంజూరయ్యాయి. టెండర్లు పిలిచినా ఎవరూ రాలేదు. మరోసారి టెండర్లు పిలిచి రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం.

– సత్యనారాయణ, పంచాయతీరాజ్‌శాఖ డీఈ

రైతులకు నష్టపరిహారం అందించాలి

పాల్వంచరూరల్: అకాల వర్షాలకు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఝెర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మందేరకలపాడు గ్రామంలో నష్టపోయిన పంటలను బుధవారం ఆయన పరిశీలించారు. మాట్లాడుతూ.. పొట్టదశలో ఉన్న వరి, కల్లాల్లోని మిర్చి, టమాట, మొక్కజొన్న పంటలు వర్షాలకు దెబ్బతినడంతో రైతులు తీవ్రంగా నష్టపోయినట్లు చెప్పారు. ఇలాంటి ప్రకృతి విపత్తుల సమయంలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర బృందాలను రప్పించి క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని అంచనా వేయించి బాధితులకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రకృతి విపత్తులు, భారీ వర్షాలతో పంటలు నష్టపోతే ఆదుకునేందుకు ప్రభుత్వ పథకం ఏదీ లేకపోవడం దారుణమన్నారు.

ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలని కోరారు. సీఎం కేసీఆర్ ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రమే హామీలు ఇస్తున్నారని గెలిచిన తరువాత వాటిని పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గడిచిన రెండుసార్లు అదే జరిగిందన్నారు. కార్యక్రమంలో కోళ్లపూడి ప్రవీణ్‌కుమార్, ఎస్‌కే.యూసుఫ్, మల్లూరి నర్సమ్మ, బానోతు మోహన్, భూక్యా మంగి, కురెల్లి వెంకటాచారి, కాటి సువర్ణ తదితరులు పాల్గొన్నారు.



టమాట పంటను పరిశీలిస్తున్న నాయకులు

టేకులపల్లి: ఇటీవల కురిసిన అకాల వర్షానికి పాడైన పంటలకు రైతుకు నష్టపరిహారం చెల్లించి వారిని ప్రభుత్వం ఆదుకోవాలని లంబాడీల ఐక్య వేదిక రాష్ట్ర నాయకుడు మూడ్ అనిల్‌నాయక్ బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతాంగం ఆరుగాల కష్టపడి, అప్పులు చేసి పండించిన పంటలు తుఫాన్ కారణంగా నేలమట్టం అయ్యాయని దీంతో రైతుల పరిస్థితి అయోమయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపరిహారం చెల్లించాలని ఆదుకోవాలని కోరారు.

అటెన్షన్ ప్లీజ్

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం

విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారింది. మండలంలోని తోగ్గూడెం శివారులోని ప్రధాన రహదారి పక్కనగల విద్యుత్ వైర్లు లేని విద్యుత్ స్తంభం ఒక పక్కకు వరిగి ప్రమాదకరంగా ఉంది. ఏ క్షణంలోనైనా కూలిపోయే పరిస్థితి. ఒరిగిన విద్యుత్ స్తంభాన్ని చూసి రైతులు భయాందోళన చెందుతున్నారు. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలిగించాలని సంబంధిత అధికారులకు అనేక సార్లు విన్నవించుకున్న పట్టించుకోవడం లేదని స్థానిక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. - పాల్వంచరూరల్



ప్రశ్నించాల్సిన అధికారి : రవీందర్, విద్యుత్‌శాఖ ఏఈ
సెల్ నంబర్ : 9440811564